## వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సేవలు

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : సరుకు రవాణా రంగాలలో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నిరంతరం భారతీయ రైల్వే సేవలందిస్తున్నదని ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో 75వ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సమావేశం సికింద్రాబాద్‌లోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో ముగిసింది.

## వాహనదారుకు ఇన్సూరెన్స్ చెల్లించాల్సిందే

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): వాహనదారుకు జీరో డిప్ ఇన్సూరెన్స్ చెల్లించాల్సిందేనని హైదరాబాద్ వినియోగదారుల కమిషన్ పేర్కొన్నది. ఇన్సూరెన్స్ చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తూ.. నిరాకరించినందుకు రూ.20 వేలు నష్టపరిహారంగా అందజేయాలని సూచించింది. సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన మహ్మద్ బాక్రీ అలీ తన కారుకు సోంపో ఇంటర్నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి వాహన బీమాను తీసుకున్నాడు. అయితే, ఓ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమయ్యింది. దీంతో ఇన్సూరెన్స్ కంపెనీకి సమాచారం అందించగా.. సర్వేయర్ వచ్చి నష్టపోయిన కారు ఇన్సూరెన్స్ చెల్లింపును అంచనావేసి బీమా సంస్థకు అందజేశాడు. కాగా, మరమ్మతు కోసం వాహనాన్ని షెడ్డుకు తరలించగా బీమా క్లెయిమ్ ఆలస్యం కావడంతో వాహన మరమ్మతును వాయిదావేస్తూ వచ్చారు. దీంతో వినియోగదారుడు సోంపో ఇంటర్నేషనల్ బీమా కంపెనీపై హైదరాబాద్ వినియోగదారుల కమిషన్‌లో కేసు వేశాడు. కమిషన్ అధ్యక్షురాలు బి.ఉమావెంకటసుబ్బలక్ష్మి, సభ్యులు సి.ప్రసన్నలక్ష్మిలతో కూడిన బెంచ్ కేసును విచారించింది. బాధితుడికి రూ.5 లక్షలు చెల్లించాల్సిందేనని సదరు ఇన్సూరెన్స్ కంపెనీని ఆదేశించింది. చెల్లింపులో నిర్లక్ష్యం వహించినందుకు రూ.20వేలు నష్టపరిహారంగా అందజేయాలని సూచించింది.

### యాచకుల మధ్య ఘర్షణ..

## ఒకరి హత్య

ఖైరతాబాద్: యాచకుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి హత్యకు దారి తీసింది. ఈ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై హరీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్ట మసీదు వెనుక వైపు శివరాజ్, అతడి కొడుకు అనిల్, కోడలు జ్యోతి నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా అక్కడే ఉంటూ యాచక వృత్తి చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఓ వ్యక్తివచ్చి.. అనిల్, మరోవ్యక్తి మధ్య పంజాగుట్ట మసీదు ప్రాంతంలో గొడవ జరుగుతున్నదంటూ శివరాజ్‌తో చెప్పాడు. హుటాహుటిన కోడలను తీసుకొని అక్కడికి వెళ్లి చూడగా, అనిల్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. స్థానికుల సాయంతో వెంటనే 108 వాహనాన్ని రప్పించగా, అందులో ఉన్న సిబ్బంది పరీక్షించి అనిల్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. శ్రీను అనే యచకుడిపై అనుమానం ఉన్నదని, అతడే కొట్టి చంపాడని పేర్కొం టూ తండ్రి శివరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.







